క్లుప్తంగా

శివాలయంలో రుద్రాభిషేకం

తాళ్లగడ్డ(సూర్యాపేట) : మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి శివాలయంలో వైశాఖ మాసం మూడవ సోమవారం సందర్భంగా శ్రీమహాదేవ నామేశ్వర స్వామికి పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. మహాదేవుడికి విశేష అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి



భేరీ వాయిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిషోర్

నూతనకల్ : ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తాళ్లసింగారంలో సొడమ్మ జాతరకు హాజరై దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య, బత్తుల సాయిలుగౌడ్, గుగులోతు నర్సింగ్‌నాయక్, మందడి సోమిరెడ్డి,గుగులోతు సురేందర్‌నాయక్, జటంగి వెంకన్న, తాడూరి సైదులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వాస శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి ప్రజలు సహకారించాలని కోరారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పట్టణంలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని పుర వీధుల్లో సోమవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ పర్యటించారు. ఈ సందర్భంగా పలు వార్డులను సందర్శించారు. కాలువల పూడికతీత, వీధుల్లో పరిశుభ్రతను గురించి ఆరా తీశారు. అనంతరం చెత్త సేకరణ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. ప్రతి రోజూ చెత్త సేకరణ చేయాలని సూచించారు.

జాజిరెడ్డిగూడెం సీసీ సస్పెన్షన్

భానుపురి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం ఒకటవ గ్రామ సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సంబంధిత సీసీ నగేష్‌ను బాధ్యుడిగా చేస్తూ కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సోమవారం సస్పెండ్ చేశారు. ఈ కొనుగోలు కేంద్రం నిర్వహణ ట్రక్ షీట్‌లో కొట్టివేతలు, తప్పులు ఉండడంతో ఉన్నతాధికారులకు పలు ఫిర్యాదులు అందాయి. దీంతోపాటు ట్యాబ్ ఎంట్రీ కూడా ఇతరులు చేస్తున్నారని, ఎగుమతి అయిన ధాన్యం తూకంలో తేడాలు ఉంటున్నాయని అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో సీసీని సస్పెండ్ చేయడంతో పాటు వీఓఏ, కమిటీ సభ్యులు మొత్తాన్ని తొలగిస్తున్నట్లు తెలిపారు.

బొడ్రాయి మహోత్సవం

నాగారం : ఈటూరులో బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్ఠ మహోత్సవాలను సోమవారం మూడవరోజు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. బొడ్రాయి వద్ద గణపతి పూజ, పుణ్యాహావాచనం, నాభిశిల ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ హోమం, పూర్ణాహుతి, కుంబాభిషేకం, శాంతి కల్యాణం, ఆశీర్వచనం, గ్రామ దేవతకు పంచబోనాలు, ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు కొండగడప హరిప్రసాద్ శర్మ, కాశీ లక్ష్మణశర్మ, శేషగిరి, కాశీ వేణుశాస్త్రి, తిరుమలగిరి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చింతారెడ్డి రాజగోపాల్ రెడ్డి, చిల్లర చంద్రమౌళి, గోడిశాల యాదగిరి, కన్నెబోయిన రాముయాదవ్, పేరాల యాదగిరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

నూతనకల్ : తాళ్లసింగారంలో సోమవారం విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన జటంగి ముత్తిలింగం తన ఎద్దును మేత కోసం వ్యవసాయ పొలం వద్ద వదిలిపెట్టాడు. ఎద్దు మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లగా అక్కడే తెగిపడి ఉన్న విద్యుత్ వైర్లు తగిలాయి. దీంతో విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందింది.

కందగట్లలో గేదె..

ఆత్మకూర్ (ఎస్) : కందగట్లలో సోమవారం విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కందగట్ల గ్రామానికి చెందిన వంగేటి మధుసూదన్ రెడ్డి తన గేదెను మేతకోసం వదిలిపెట్టాడు. అయితే గ్రామం సమీపంలో గేదె మేత మేస్తున్న క్రమంలో ఇటీవల గాలి దుమారానికి తెగిపడిన విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి గేదె మృతి చెందింది.

సిద్ధమవుతున్న యూనిఫామ్

- పాఠశాలల ప్రారంభంలోనే విద్యార్థులకు అందించేలా ప్రణాళిక
- మహిళా సంఘాలకు కుట్టుపని బాధ్యతలు అప్పగింత



కుట్టు పనులను పరిశీలిస్తున్న అధికారులు

పెన్‌పహాడ్ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠశాలల ప్రారంభంలోనే నూతన యూనిఫామ్ అందించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. యూనిఫామ్ కుట్టు పనులను ఈ ఏడాది నుంచి స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ యూనిఫామ్ సమస్య తీవ్రంగా ఉండేది. కాంట్రాక్టర్లకు కుట్టు పని బాధ్యతలు అప్పగించడంతో పాఠశాలలు ప్రారంభమై నెలలు గడిచినా విద్యార్థులకు సరిపడా యూనిఫామ్‌లు అందించలేకపోయేవారు. అంతేకాకుండా కొలతల్లో హెచ్చు తగ్గులు ఉండడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యలను అధిగమించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలోనే వస్త్రాలను కొనుగోలు చేసి యూనిఫామ్ కుట్టే పనులను మహిళా సంఘాల సభ్యులకు అప్పగిస్తున్నారు. ఫిబ్రవరిలోనే వీఓఏలు, ప్రధానోపాధ్యాయుల చొరవతో విద్యార్థుల కొలతలను సేకరించారు.

మొత్తం 2420 మంది విద్యార్థులకు..

పెన్‌పహాడ్ మండలంలో ఎనిమిది జిల్లా పరిషత్, నలభై ప్రాథమిక, నాలుగు ప్రాథమికోన్నత, ఒక కేజీబీవీ, ఒక ఆదర్శ పాఠశాల ఉన్నాయి. అన్ని పాఠశాలల్లో కలిపి మొత్తం 2420మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే మండల కేంద్రంలో గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా 10మంది మహిళా సంఘాల సభ్యులు మొత్తం 2420 యూనిఫామ్‌లు కుడుతున్నారు. ఇప్పటివరకు దాదాపుగా అన్ని యూనిఫామ్‌లు సిద్ధమైనట్లు వారు తెలుపుతున్నారు. ఇంకా చిన్న చిన్న పనులు మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది. వాటిని సైతం పూర్తి చేసి ఈ నెలాఖరు వరకు పాఠశాలలకు అందజేయనున్నారు. కుట్టు పనులను ఐకేపీ అధికారులు, ఎంఈఓ నకిరేకంటి రవి ప్రత్యేకంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

నిరంతరం పని ఉండేలా చూడాలి



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్వయం సహాయక సంఘాల ద్వారా యూనిఫామ్ కుట్టడంతో మంచి ఉపాధి పొందుతున్నాం. ప్రభుత్వ పరంగా దుస్తులు కుట్టే పనిని మాకు అందించడం ఎంతో ఆనందంగా ఉంది. జత కుట్టుకు రూ.35 ఇస్తున్నారు. నిరంతరం పని ఉండేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలి.

– మమత, మహిళా సంఘం సభ్యురాలు, పెన్‌పహాడ్

నెలాఖరు వరకు అందజేస్తాం



పెన్‌పహాడ్ మండలంలోని 54 పాఠశాలలకు చెందిన 2420మంది విద్యార్థులకు దుస్తులు కుట్టాల్సి ఉండగా ఇప్పటికే సిద్ధం చేశారు. చిన్నచిన్న పనులు మిగిలి ఉన్నాయి. వాటిని కూడా వెంటనే పూర్తి చేసి ఈనెలాఖరు వరకు యూనిఫామ్‌లను ఎంఈఓకు అప్పగిస్తాం. మహిళా సంఘాలకు చెందిన 10మంది సభ్యులు దుస్తులు కుట్టారు.

– అజయ్‌నాయక్, ఏపీఎం

ఘనంగా అష్టోత్తర శతఘటాభిషేకం



శతఘటాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



హోమంలో పాల్గొన్న భక్తులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : పట్టణంలోని శ్రీభక్తాంజనేయ ఆలయంలో శ్రీహనుమాన్ జయంతి పంచాహ్నిక ఉత్సవాలలో భాగంగా సోమవారం అష్టోత్తర శతఘటాభిషేకం ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు ఫణి కుమారాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృత అభిషేకంతోపాటు హోమం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా దరూరి శ్రీనాథ చార్యుల ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీదరూరి రామానుజాచార్యులు, దరూరి శ్రీకాంతాచార్యులు, దరూరి శ్రీధరాచార్యులు, ధరూరి పవన్ కుమారాచార్యులు, భక్తులు వెంపటి సురేష్, పబ్బా ప్రకాష్, పబ్బా రామమూర్తి, పురం నాగరాజు, దేవేంద్ర చారి, తొనుకునూరి వెంకటేశ్వర్లు, గుండా గోపికృష్ణ భవాని, నోముల శ్రీనివాస్, కొత్త రజిని, నోముల విమల తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష మల్లెల పుష్పార్చన..

మంగళవారం ఉదయం శ్రీభక్తాంజనేయ స్వామి వారికి అభిషేకం, ఆకుపూజ, అలంకరణ, ప్రసాదం ఆరగింపు, మంగళశాసనం, తీర్థగోష్ఠి, లక్షమల్లెల పుష్పార్చన నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ లక్ష్మణరావు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని దేవాలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కొత్త ఆంజనేయులు కోరారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

అర్వపల్లి : అకాల వర్షాల దృష్ట్యా కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడవకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ చిప్పలపెల్లి యాదగిరి సూచించారు. సోమవారం ఉయ్యాలవాడ, అర్వపల్లి, కుంచమర్తి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం రాశులు వర్షానికి తడవకుండా పట్టాలు కప్పి భద్రపర్చుకోవాలని కోరారు. లారీల కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ పాటి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే మందుల సామేల్



జి.కొత్తపల్లిలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మద్దిరాల : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో కొనసాగుతుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం జి.కొత్తపల్లి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.15లక్షలతో మంజూరైన సీసీరోడ్డు పనులను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండలానికి ఈ మధ్యకాలంలోనే రూ.2 కోట్ల సీసీరోడ్డు పనులను కేటాయించగా అందులో రూ.1.65కోట్ల పనులను పూర్తి చేశామని, ఇంకా రూ.35లక్షల పనులు పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. ముకుందాపురం నుంచి జి.కొత్తపల్లి వరకు రోడ్డు గుంతలమయంగా మారిందని, వెంటనే బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తామని అన్నారు. 10 సంవత్సరాలుగా గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడం లేదని గ్రామస్తులు చెప్పడంతో ఎమ్మెల్యే వెంటనే ఆర్టీసీ ఎండీతో మాట్లాడి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిల మల్లు యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పచ్చిపాల సుమతి వెంకన్న, బొబ్బిలి వెంకన్న, వివేక్‌రెడ్డి, తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, పులిగిల్ల లింగయ్య యాదవ్, అశోక్‌రెడ్డి, అశోక్‌యాదవ్, ఎల్లేష్, ఉమేష్, సాయిరెడ్డి, వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఏఓ అనిషారూహి, పీఆర్ డీఈఈ లింగనాయక్ పాల్గొన్నారు.

స్నేహ నిలయంలో న్యాయ అవగాహన సదస్సు



వికలాంగులు, వృద్ధులతో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి ఫర్హీన్ కౌసర్

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట పట్టణంలోని జనగామ రోడ్‌లో ఉన్న స్నేహ నిలయాన్ని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి ఫర్హీన్ కౌసర్ సోమవారం సందర్శించి లీగల్ లిటరసీ క్యాంపు (న్యాయ అవగాహన సదస్సు) నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగులు, వయోవృద్ధులతో మాట్లాడి వారి సమస్యలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. మానసిక అనారోగ్యం, మేధో వైకల్యం ఉన్న వ్యక్తులకు అందించే ప్రత్యేక న్యాయ సేవల గురించి తెలియజేశారు. అందరికీ పెన్షన్ వస్తుందా లేదా అని తెలుసుకొని, రాని వారి వివరాలను పరిశీలించారు. పెన్షన్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్నేహ నిలయం కార్యనిర్వాహకులు పీటర్, సెమిలీ, సూర్యాపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొంపల్లి లింగయ్య, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సుంకరబోయిన రాజు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బి.వెంకటరత్నం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, పి.వాణి, డీఎల్ఎస్ఏ నామినేటెడ్ మెంబర్స్ శ్రీఅల్లంనేని వెంకటేశ్వర్ రావు, గుంటూరు మధు, అడ్వకేట్స్ పాల్గొన్నారు.

అమరుల ఆశయాల సాధనకు ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న విమలక్క

ఆత్మకూర్ (ఎస్) : పేదల హక్కుల కోసం పోరాడిన అమరుల ఆశయాల సాధన కోసం యువత ఉద్యమించాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రెండు తెలుగు రాష్ట్రాల గౌరవాధ్యక్షురాలు విమలక్క అన్నారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని రామన్నగూడెంలో విప్లవోద్యమ సీనియర్ నాయకులు ఆరుట్ల వెంకటరెడ్డి, ఆరుట్ల శంకర్‌రెడ్డిల స్మారక స్థూపం ఆవిష్కరణ సభలో ఆమె పాల్గొన్నారు. అమరుల స్థూపాన్ని సీపీఐఎంఎల్ జనశక్తి రాష్ట్ర నాయకుడు అమర్ ఆవిష్కరించారు. అనంతరం విమలక్క మాట్లాడారు. ఆరుట్ల వెంకటరెడ్డి, ఆరుట్ల శంకర్ రెడ్డిలు కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించారని అన్నారు. రైతు కూలీ సంఘం నాయకుడు బత్తుల గురవయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కట్ట భగవంత రెడ్డి, దేగల జనార్దన్, ఏపూరి సోమన్న, ఆరుట్ల జానకిరెడ్డి, బొమ్మకంటి కొమరయ్య, పల్స యాదగిరి, పల్లెబోయిన జాని, బెల్లి నాగరాజు, పోతుల రమేష్, రాకేష్, నారగాని కృష్ణ, జుజ్జూరి సత్యం, రాచకొండ మల్లయ్య, ఆరుట్ల ఉపేంద్ర, ఆరుట్ల వెంకటరెడ్డి, మల్లారెడ్డి, పల్లె లింగన్న, పూజ పాల్గొన్నారు.

శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



వేడుకలకు హాజరైన భక్తులు

నాగారం : వర్ధమానుకోట గ్రామంలో పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయం 30వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి, శ్రీమాత గోవిందమాంబ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతామూర్తుల విగ్రహాలను డప్పుచప్పుళ్లతో గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు దేవాలయ కమిటీ చైర్మన్ మేడోజు పోతులూరచారి పట్టు వస్త్రాలను, తలంబ్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్సోజు చామంతి నరేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, ఆలయ కమిటీ సభ్యులు వెంకటయ్య, వీరయ్య, రాంబ్రహ్మం, ఆంజనేయులు, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

ఆత్మకూర్(ఎస్) : సూర్యాపేట డిపో నుంచి ఖమ్మం పట్టణానికి ఆత్మకూరు మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు సోమవారం సూర్యాపేట ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. మిర్చి, పత్తి విక్రయాలతోపాటు వైద్య సదుపాయం కోసం ఆత్మకూరు మండల ప్రజలు నిత్యం ఖమ్మం వెళ్తుంటారని తెలిపారు. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు రావాల్సిన ప్రజలు రోజూ ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కసగాని బ్రహ్మం, దేగల వెంకటకృష్ణ, జలగం మల్లేష్, పందిరి మాధవరెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం

నాగారం : పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఈటూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులను సోమవారం తిరుమలగిరి లయన్స్‌క్లబ్ సభ్యులు అభినందించారు. 541 మార్కులతో పాఠశాలలో ప్రథమ స్థానం సాధించిన మేడబోయిన ప్రశాంత్‌ను, ద్వితీయ ర్యాంక్ సాధించిన మెతుకు ధనుష్‌లను శాలువాలతో సన్మానించి, నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వాసం ప్రభాకర్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సోమేష్, లయన్స్‌క్లబ్ సభ్యులు డాక్టర్ సుందరం, సుజాత, గణేష్, రమేష్, రామచంద్రన్‌గౌడ్, పద్మారెడ్డి, కృష్ణమాచారి, శీను పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



సూర్యాపేట అర్బన్ : సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



నూతనకల్ : నివాళులర్పిస్తున్న నాయకులు



తిరుమలగిరి : తెలంగాణ చౌరస్తాలో..

సూర్యాపేట అర్బన్ : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని సోమవారం సూర్యాపేటలో సీపీఎం వన్ టౌన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎర్రజెండాల వద్ద సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎదుగురి గోవిందు, సీపీఎం వన్ టౌన్ కార్యదర్శి వల్లపుదాసు సాయికుమార్, పట్టణ కమిటీ సభ్యులు మామిడి పుల్లయ్య, ఎస్‌కే జాంగిర్, ఎస్‌కే సైదులు, కప్పల సత్యం, మాదగోని మల్లేష్ పాల్గొన్నారు.

నేటితరం నాయకులకు ఆదర్శం

నేటితరం రాజకీయాలకు సుందరయ్య జీవితం ఎంతో ఆదర్శమని సీపీఎం సూర్యాపేట వాణిజ్య భవన్ శాఖ కార్యదర్శి బొమ్మిడి లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం సుందరయ్య వర్ధంతి సందర్భంగా వాణిజ్య భవన్ సెంటర్‌లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దేవత్ కిషన్, చిత్రం భద్రమ్మ, బంధు రుద్రమ్మ, మేడి కృష్ణారెడ్డి, గోగుల సురేష్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరి రావు అన్నారు. సోమవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో సుందరయ్య 40వ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గుమ్మడవెల్లి ఉప్పలయ్య, మండల కమిటీ సభ్యులు కడెం లింగయ్య, చిత్తలూరు సోమయ్య, కొత్తగట్టు మల్లయ్య, నిర్మాల యాకయ్య పాల్గొన్నారు.

చివ్వెంల : కుడకుడలో సోమవారం సీపీఎం టూటౌన్ కమిటీ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ కార్యదర్శి పిండిగ నాగమణి, కంచుగట్ల శ్రీనివాస్, రేణుక, లింగయ్య, యర్రయ్య, నాగయ్య పాల్గొన్నారు.



చివ్వెంల : సీపీఎం టూ టౌన్ ఆధ్వర్యంలో..



పెన్‌పహాడ్ : నాగులపాటి అన్నారంలో..

పెన్‌పహాడ్ : సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ అన్నారు. సోమవారం నాగులపాటి అన్నారంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐతబోయిన సత్యం, ధనియాకుల శ్రీనివాస్, వెంకన్న, నకిరేకంటి సత్యం, గర్నె నాగరాజు, నరసయ్య పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం స్ఫూర్తిదాయకం

సుందరయ్య జీవితం స్ఫూర్తిదాయకమని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. సోమవారం సుందరయ్య వర్ధంతి సందర్భంగా లింగాలలో సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శులు రణపంగ బుచ్చిరాములు, నరేష్, ఎస్‌కే అబ్బురు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లి, జాజిరెడ్డిగూడెంలలో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, ఈదురు వీరపాపయ్య, వజ్జె సైదయ్య, కొప్పోజు యాదగిరి, కొమ్ము విజయకుమార్ పాల్గొన్నారు.

నాగారం : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని సోమవారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం, మండల కార్యదర్శి దేవరకొండ యాదగిరి, మండల కమిటీ సభ్యులు గూడపురి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తుంగతుర్తి : సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని సీపీఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తాటి విజయమ్మ, పళ్ల సుదర్శన్, గడ్డం ఎల్లయ్య, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : పుచ్చలపల్లి సుందరయ్య ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి కోరారు. సోమవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన సుందరయ్య వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సామ వెంకట్‌రెడ్డి, కూసు సైదులు, జటంగి లింగయ్య, ముండ్ల సంజీవ, తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి : నివాళులర్పిస్తున్న నాయకులు



నాగారంలో



తుంగతుర్తిలో

ప్రయోగాత్మకంగా బోధించడం ఉత్తమ పద్ధతి

తాళ్లగడ్డ (సూర్యాపేట) : ప్రయోగాలతో బోధన ఉత్తమ పద్ధతి అని మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బాలెంల గ్రామంలో స్ప్రెడ్ ఇంటర్నేషనల్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ క్యాంపులో సోమవారం ఏర్పాటు చేసిన హరివిల్లు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రయోగాల ద్వారా బోధన అందించేందుకు ఉచిత సమ్మర్ క్యాంపును ఏర్పాటు చేసిన ప్రవాస భారతీయుడు శ్రీధర్ పటేల్‌ను అభినందించారు. వేసవిలో చిన్నారులకు ఆట పాటలతోపాటు డ్రాయింగ్, కాపీ రైటింగ్, సైన్స్ ప్రయోగాలు, ప్రాజెక్టుల తయారీకి అవసరమయ్యే వస్తువులను ఉచితంగా అందజేయడం గొప్పవిషయం అన్నారు. సువెన్ ఫార్మా, అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని సంచార ప్రయోగశాల ఆధ్వర్యంలో సోమవారం బాలెంలలోని వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సమ్మర్ క్యాంపు కోఆర్డినేటర్ గోళ్లమూడి రమేష్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో స్ప్రెడ్ ఆఫీస్ ఇన్‌చార్జ్ ఆవుల ప్రసాద్, గ్రామ పెద్దలు కంచర్ల వేణురెడ్డి, ప్రభాకర్, రామచంద్రా రెడ్డి, క్యాంపు రిసోర్స్ టీచర్లు మమత, స్రవంతి, విజయ, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

సూర్యాపేట అర్బన్ : ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని తెలంగాణ రైతు జన సమితి జిల్లా అధ్యక్షుడు కొల్లు కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం తెలంగాణ రైతు జన సమితి జిల్లా నాయకులతో కలిసి ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రాంబాబుకు వినతి పత్రం అందజేశారు.

గంగాదేవి పండుగ



గంపలతో వెళ్తున్న మహిళలు

చివ్వెంల : బీబీగూడెంలో సోమవారం శ్రీగంగాదేవి పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు గంపలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లారు. గ్రామ శివారులో అమ్మవారి ఆలయం వద్ద ప్రదక్షిణలు నిర్వహించి, నైవేద్యం వండి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో నాగరాజు, నవీన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

తుంగతుర్తి : వెలుగుపల్లి గ్రామంలో సోమవారం నిక్షయ శివీర్-2 క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి లింగమూర్తి ఆధ్వర్యంలో క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ విజయ్ కుమార్, ఎంపీహెచ్ఈఓ రవికుమార్, ఎస్‌టీఎస్ సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ కిరణ్, హెల్త్ అసిస్టెంట్స్ గాజుల సోమన్న, యాదగిరి, నరసింహ చారి, ఏఎన్ఎంలు స్వప్న, అఫ్రీన్, రవి, ఆశాలు జయమ్మ, పద్మ, సుజాత, కమలమ్మ,తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : క్షయ వ్యాధి నివారణకు కృషి చేయాలని హెచ్ఈఓ భూతరాజు శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని అనంతారం గ్రామంలో నిక్షయ్ శివర్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో క్షయ వ్యాధి నిర్ధారణకు వైద్యపరీక్షలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ భూతరాజు సైదులు, ఏఎన్ఎంలు దుర్గ, నాగలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు రమేష్, మధు, ల్యాబ్ టెక్నీషియన్ లింగాల రాజు తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులను ఇబ్బందులకు గురి చేయొద్దు

నూతనకల్ : నూతనకల్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంట ఉన్న చిరు వ్యాపారులను అధికారులు, దుకాణ యజమానులు ఇబ్బందులకు గురిచేయొద్దని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య మాట్లాడారు. రోడ్డుకు 50ఫీట్ల లోపు ఎలాంటి వ్యాపార లావాదేవీలు నిర్వహించరాదని అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. చిరువ్యాపారులకు ప్రత్యేక స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేసోజు మధు, యూనియన్ మండల అధ్యక్షులు కనకం వెంకటమ్మ, మురళి, భద్రమ్మ, హేమలత, కళమ్మ, సుమలత, శృతి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.